క్లుప్తంగా

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



జగ్గంపేటలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజలకు వివిధ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వివరిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం జగ్గంపేటలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన లేఖలను ప్రజలకు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల రూపంలో పొందిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, వైఎస్సార్ సీపీ నేతలు గఫూర్, రామకుర్తి జగాల్, కాపారపు ప్రసాద్, జల్లి ప్రవీణ్ కుమార్, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మతల్లి

తొండంగి: మండలంలోని ఏవీ నగరం గ్రామ దేవత గంగాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మాఘ అమావాస్య నుంచి కొత్త అమావాస్య వరకూ నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయం వద్ద గరగ నృత్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కొత్త అమ్మవాస్య ముందు రోజు రాత్రి జాగారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిరిమానోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



రాఘవపట్నంలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న పర్వత జానికీదేవి

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నంలో పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం వద్ద అన్నవరం లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ నాయకురాలు పర్వత జానకీదేవి పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు లయన్స్ క్లబ్ అండగా నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పర్వత వివేక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చెన్నాడ సత్తిబాబు, మాజీ సర్పంచ్ చెన్నాడ భీమరాజు, ఎంపీటీసీ సభ్యురాలు అయితా నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

పాదురుపాకలో ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాదురుపాకలో ఆదివారం టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం స్థానిక అచ్చియ్యపేటకు చెందిన రాజాని శ్రీనివాస్ (40) తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను మరో వ్యక్తితో కలిసి తంటికొండ వైపు నుంచి గోకవరం బైక్‌పై వస్తుండగా, చర్చి సమీపంలోని ఆర్చి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వీరిని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, శ్రీనివాస్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా త్రిశూల స్నానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయ పుష్కరణిలో ఆదివారం త్రిశూల స్నానం జరిగింది. బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం దీక్షాధారణ చేసిన శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి దంపతులకు ఆలయ కోనేరులో ముందుగా ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అక్కెక్కి రాజ్‌గోపాల్‌లు త్రిశూల స్నానం చేయించారు.

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ



జెఅన్నవరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల

- ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జె.అన్నవరం గ్రామానికి చెందిన సుమారు 100 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, కాకరపల్లి వీరంశెట్టి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై సిద్ధం సభను వీక్షిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల, పార్టీ శ్రేణులు

సిద్ధం సభ ప్రత్యక్ష వీక్షణం

ఏలేశ్వరం: బాపట్ల సమీపంలోని మేదరమెట్ల వద్ద ఆదివారం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభను పట్టణంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ కనెక్షన్ హాలులో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా సిద్ధం సభ ప్రత్యక్ష ప్రసారం చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని పార్టీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్‌కు ప్రజాదరణ భారీగా పెరిగిందనడానికి సిద్ధం సభలకు లక్షలాదిగా ప్రజలు రావడమే నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో వైఎస్సార్ సీపీ 175కి 175 స్థానాల్లోనూ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, అడపా పార్థసారథి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- చిల్లంగిలో ఆత్మీయ సమావేశం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని చిల్లంగిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు అడారి మహేష్, పీల లోవసుబ్రహ్మణ్యం, అడారి గంగబాబు, ఓలేటి రాజు, కర్రి సింగరయ్య, శరకణం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి
- రామయ్యపాలెంలో ఎన్నికల ప్రచారం



రామయ్యపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న తోట వాణి, శ్రీనిధి

గండేపల్లి: సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని రామయ్యపాలెంలో ఆదివారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరు మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, బొర్రంపాలెం సర్పంచ్ పోకల సుబ్బు, పార్టీ నేతలు పరిమి వెంకటేశ్వరరావు, తుల రాము తదితరులు పాల్గొన్నారు.


స్ఫూర్తిప్రదాత సావిత్రీబాయి పూలే



తునిలో సావిత్రీబాయి, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బీసీ ఐక్య వేదిక ప్రతినిధులు

తుని: సంఘ సంస్కర్త, తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శమని స్థానిక బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు ఫక్కుర్తి గోవిందరావు అన్నారు. స్థానిక మున్సిపల్ పార్క్‌లో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. బీసీ ఐక్య వేదిక నాయకులు సావిత్రీబాయి, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి కరెళ్ల గణపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధన్యుని సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు నేరేళ్ల సత్యనారాయణ, గౌరవ సలహాదారు నెల్లిపూడి బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి కర్రి వెంకటరమణ, ఉప్పరాపల్లి నాగు, గింజాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత



తుని తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలకు భద్రపరిచిన గదికి సీల్ వేసిన అధికారులు

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు అవగాహన కల్పించేందుకు తీసుకువచ్చిన ఈవీఎంలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తుని తహసీల్దార్ కార్యాలయానికి చేరిన డమ్మీ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఆదివారం కంప్యూటర్ గదిలో భద్రపర్చారు. గదికి సీలు వేసిన సర్వే అధికారులు బందోబస్తుగా కానిస్టేబుల్‌ను ఉంచారు. ఇప్పటికే తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు ఉంచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశామన్నారు. అగ్నిప్రమాదాలు, వర్షపు నీరు నుంచి రక్షణ కల్పించేందుకు తగిన ఏర్పాటు చేసినట్టు సర్వేయర్ దేవుడు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్దనే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓల పర్యవేక్షణలో పీఓలకు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని కేఏ మల్లవరంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదివారం తెలిపారు. మల్లవరంలో నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ఉదయం 11 గంటలకు మంత్రి ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పటిష్ట భద్రత ఏర్పాటు చేయండి

గండేపల్లి: తాళ్లూరులో ఈ నెల 20న జరిగే వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ పోలీసులను కోరారు. ఈ మేరకు ఆదివారం జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్సై ఎస్.రామకృష్ణలను కలిసి వినతి పత్రం అందజేశారు.

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం



తుని మేదరిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్ మల్లిక్, నాయకులు

తుని: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. స్థానిక 12వ వార్డు మేదరిపేట, మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్‌లో ఆదివారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువనేత శంకర్ మల్లిక్‌కు మహిళలు మంగళ హారతులు పట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా, మంత్రి రాజాను ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు చెబుతున్న మాయ మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, తుని పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి బుచ్చిరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, వార్డు కౌన్సిలర్ బుడ్డిగ దారేష్, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- జె.అన్నవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



జె.అన్నవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అపలేరన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దె నెక్కడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, కొండపల్లి వెంకటేశ్వరరావు, కాలారి సత్తిబాబు, కాకరపల్లి వీరంశెట్టి, పసల నాగేశ్వరరావు, మేఘం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు



ఎస్.అన్నవరంలో అరుణ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు దత్తాత్రేయ శర్మ, వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. మొత్తం 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

వైభవంగా అరుణమంత్ర హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అరుణ మంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మాఘమాసం ఆఖరిరోజు కావడంతో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అరుణ హోమం నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



పి.ఇ.చిన్నాయపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

తొండంగి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు అన్నారు. మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, సర్పంచ్ పసపులేటి పద్మవిజయ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ, గ్రామ వలంటర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు దడాల విజయ్, ఆరుమిల్లి ఏసుబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి ఆంజనేయులు, ఎంపీటీసీ జి.మంగ, సర్పంచ్ పసపులేటి విజయ, పంచాయతీ కార్యదర్శి పి.రాము, గ్రామసచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల మాక్ డ్రిల్

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని కృష్ణవరం, గోనేడ గ్రామాల్లో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో మాక్ డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై షేక్ జబీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి పార్కులో సండే సందడి



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న యువత



ఆట వస్తువులతో కేరింతలు కొడుతున్న చిన్నారులు



తుని పార్కులోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న పర్యాటకులు

తుని: పుస్తకాలతో కుస్తీ పట్టి అలసిపోయిన చిన్నారులు కాసేపు సరదాగా గడిపారు. ఎల్లప్పుడూ పని ఒత్తిడితో ఉండే పెద్దలు సేద తీరారు. స్థానిక శ్రీపొట్టి శ్రీరాములు గణపతినగర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పెద్దలు నుంచి చిన్నారులు వరకూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సందడి చేశారు. ఇటీవల పార్కును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయడం, మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, జిమ్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో యువత ఆట పాటలతో సందడి చేశారు. తుని పట్టణంతో పాటు పాయకరావుపేట నుంచి భారీగా సందర్శకులు తరలి రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

కొండరాజులబాబు ఆలయానికి ర్యాలీగా వెళ్లిన భక్తులు

కోటనందూరు: రౌతులపూడి మండలం రామకృష్ణాపురంలో కొండరాజులబాబు ఆలయానికి మండలంలోని కేఏ కొత్తూరుకు చెందిన భక్తులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. రామకృష్ణాపురంలో కొండరాజులబాబు జాతరను పురస్కరించుకుని సుమారు 10 కిలోమీటర్ల దూరం డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ వేలాదిగా భక్తులు తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. ఏళ్ల తరబడి ఈ ఆచారాన్ని కొనసాగిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



రామకృష్ణాపురం రాజులబాబు ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మురారిలో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గండేపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ప్రభావతి సూచించారు. మండలంలోని మురారి జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళలతోనే మంచి సమాజం సాధ్యమన్నారు. అమ్మగా, అత్తగా, భార్యగా, చెల్లిగా, స్నేహితురాలిగా మహిళలు సమాజంలో అత్యుత్తమ పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నరాము, జిల్లా కమిటీ నగేష్, చక్రవర్తి, సాయిరాం, పీవీవీ సత్యనారాయణ, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరకంచిలో బీజేపీ ప్రజాపోరు యాత్ర

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన సాగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉత్తరకంచిలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు కేంద్ర పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు గున్నాబత్తుల రాజుబాబు, ఇంటి బాబూరావు, చింతాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.